క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

ముమ్మిడివరం: ముమ్మిడివరం శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వవన్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది సుమారు 500 వందల మామిడి పండ్లతో స్వామివారిని అలంకరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వివిధ ద్రవ్యాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గురుస్వాములు పెన్మత్స జగ్గప్పరాజుస్వామి, వి.చిన్నారావు, సరిపెల్ల రామకృష్ణంరాజు, సీఐ ఎస్.కొండయ్య, ఎస్సై కె.సురేష్‌బాబు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

కనకదుర్గమ్మ జాతర మహోత్సవాలు



కూనవరంలో విచిత్ర వేషధారణలో కళాకారులు

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామంలో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. నైవేద్యాలు చెల్లించి ప్రత్యేకంగా అలంకరించి, అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో పలు వేషధారణలతో కూడిన నృత్యాలు పలువురికి ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ కొండయ్య తదితరులు

ముమ్మిడివరం: ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య సూచించారు. ఇటీవల కాకినాడ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ప్రతిభ కనబర్చిన స్థానిక హెల్తీ లైఫ్ జిమ్ క్రీడాకారులను ఆయన అభినందించారు. 49 కేజీల విభాగంలో వాసంశెట్టి మణికంఠ గోల్డ్ మెడల్, 40 కేజీల విభాగంలో కడలి గౌతమ్ సిల్వర్ మెడల్, 55 కేజీల విభాగంలో మల్లిక్‌సాయి సిల్వర్, 102 కేజీల విభాగంలో దొమ్మేటి వేణుసాగర్ సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని శుక్రవారం సీఐ కొండయ్య అభినందించారు. కోచ్ వాసంశెట్టి నరేష్, చిట్టూరి ప్రవీణ్, కోలా రాఘవేంద్ర, రాము, చెల్లూరి వినయ్, మట్టపర్తి విష్ణు, గుర్రాల సచిన పాల్గొన్నారు.

చెరువుల అక్రమ తవ్వకాలను అడ్డుకున్న అధికారులు



అధికారుల జోక్యంతో ఆగిన చెరువుల పనులు

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప పంచాయతీ గాజింగి తిప్ప సమీపంలోని గరువుపేటలో నాన్ ఆక్వా జోన్ పరిధిలో ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా తవ్వేస్తున్న చెరువుల పనులను రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు అడ్డుకున్నారు. 'అనుమతులు లేకుండా చెరువులు అనధికారిక తవ్వకాలు' పేరిట సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు స్పందించి పనులను నిలిపివేశారు.

మహిళను కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

అయినవిల్లి: పాత గొడవల నేపథ్యంలో ఓ మహిళపై కత్తితో దాడి చేసిన వ్యక్తిపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అయినవిల్లి గ్రామానికి చెందిన నేదునూరు వెంకటలక్ష్మి పొలం నుంచి గేదె పాలు తీసుకుని వస్తుండగా అదే గ్రామానికి చెందిన నొంద్రు సంజీవరావు పాత గొడవల నేపథ్యంలో కాపుకాచి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. దీనిపై పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

దడ పుట్టిస్తున్న రోహిణి కార్తె

- భానుడి భగభగలు.. జనం ఇక్కట్లు
- ఎండలు, ఉక్కపోతతో తప్పని ఆపసోపాలు
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు



భానుడు భగభగలతో జన సంచారం లేక నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి 216



చలివేంద్రం వద్ద మజ్జిగ తాగుతున్న పాదచారులు

తాళ్లరేవు: రోహిణీ కార్తె ప్రజలకు దడ పుట్టిస్తోంది. నాలుగు రోజులుగా ఎండల తీవ్రత కారణంగా జనం అల్లాడిపోతున్నారు. మండే ఎండలతో వాతావరణం నిప్పుల కొలిమిగా మారింది. భానుడి భగభగలు జనాన్ని తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తున్నాయి. నాలుగురోజులుగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ప్రచండ భానుడు నిప్పులు చెరుగుతుండడంతో జనం ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. దీంతో జన సంచారం లేక రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం ఐదు గంటలు దాటినా వేడిగాలులు తగ్గకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో ఆపసోపాలు పడుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వ్యవసాయ పనులకు వెళుతున్న రైతులు, ఉపాధి కూలీలు వేకువజామున పనులకు వెళ్లి త్వరగా పనులు ముగించుకుని ఇంటికి చేరుకుంటున్నారు. ఎండ ధాటికి గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం అల్లాడిపోతున్నారు. గాలి వేడిగా ఉండడం, తీవ్రంగా చెమట పట్టడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి తాపాన్ని తట్టుకోలేక, ఏసీలను, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ విస్తృత ప్రచారం చేస్తోంది. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని తప్పనిసరి పరిస్థితులలో వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, గొడుగు, ముఖానికి మాస్క్ ధరించి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. భానుడు ప్రతాపం రోజురోజుకు ఎక్కువ కావడంతో జనం ఇంటికే పరిమితమవుతున్నారు. దీంతో మండల పరిధిలో నిత్యం రద్దీగా ఉండే తాళ్లరేవు సంతపేట సెంటర్, చెరువుగట్టు సెంటర్, దేవీమహల్ సెంటర్, సుంకరపాలెం జంక్షన్ తదితర రహదారులు జనం లేక వెలవెలబోతున్నాయి. జాతీయ రహదారి 216 సైతం జన సంచారం లేక వెలవెలబోయింది. వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు జనం శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాల ద్వారా చల్లటి మజ్జిగను సరఫరా చేస్తుండడంతో పాదచారులు, వాహనదారులు వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు.

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు (డిగ్రీలలో) ఇలా...

జూన్ 2	41.4
జూన్ 1	38.8
మే 31	37.1
మే 30	34.6
మే 29	36.8
మే 28	37.2
మే 27	39.6

నిబంధనలు సడలించాలి



వారం రోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 6.30 గంటల నుంచి 10 గంటల వరకే పనిచేసేవిధంగా అధికారులు నిబంధనలు సడలించాలి. కూలీలు పనిచేసే సమయంలో తాగునీటితో పాటు చల్లటి మజ్జిగను సరఫరా చేయాలి. ఏ కూలీకైనా వడదెబ్బ తగిలితే ప్రత్యేక వైద్య సేవలు అందించాలి.

టేకుమూడి ఈశ్వరరావు
– ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు

ఎండను తట్టుకోలేకపోతున్నాం



వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. పనికి వెళ్లిన గంట వ్యవధిలోనే ఎండ తీవ్రత ఎక్కువై నీరసం వస్తోంది. ముఖ్యంగా వృద్ధులు ఎండకు పనిచేయలేకపోతున్నారు. గతంలో తాగునీరు, మజ్జిగను సరఫరా చేసేవారు, కానీ ప్రస్తుతం ఇవ్వడం లేదు. వేసవి తాపాన్ని తగ్గించేందుకు మజ్జిగను సరఫరా చేయాలి.

– దున్నా శైలజ, ఉపాధి కూలీ, పి.మల్లవరం.

శీతల పానీయాలను ఎక్కువగా తాగుతున్నారు



ఎండ ప్రభావం ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఎక్కువగా శీతల పానీయాలను సేవిస్తున్నారు. కూల్ డ్రింక్‌లు, బటర్‌మిల్క్, జ్యూస్‌లను ఎక్కువగా తాగుతున్నారు. సాయంత్రం సమయంలో ఎక్కువగా జ్యూస్‌లను తాగుతున్నారు.

– కొప్పిశెట్టి రాంబాబు,
జ్యూస్ షాప్ యజమాని, తాళ్లరేవు

పర్యావరణ హిత జీవన శైలిని అలవర్చుకోవాలి



విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కుతున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: మనం ఉండే పరిసరాలు, భుజించే ఆహారం అన్నీ పర్యావరణ హితంగా ఉండాలని, పర్యావరణ జాగ్రత్తలతో కూడిన జీవన శైలిని అలవర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు పట్టణ ప్రజలకు సూచించారు. స్థానిక వెత్సావారి అగ్రహారంలో శుక్రవారం జరిగిన పర్యావరణ హిత జీవన శైలి కార్యక్రమంలో కమిషనర్ నాయుడు ప్రసంగించారు. విద్యార్థులు, వార్డు సచివాలయ పర్యావరణ కార్యదర్శులు, వలంటీర్లు, వెత్సావారి అగ్రహారం ప్రజలతో కలిసి కమిషనర్ నాయుడు పర్యావరణాన్ని కాంక్షిస్తూ కిలోమీటరు మేర సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ నాయుడు తొలుత సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించడమే కాకుండా ఆయన కూడా సైకిల్ తొక్కి ర్యాలీలో పాల్గొన్నారు. వెత్సావారి అగ్రహారం నుంచి స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకూ ర్యాలీ సాగింది. ప్లాస్టిక్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులు, కంచాలు, కప్పులు పూర్తిగా విడనాడాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. వార్డు సచివాలయ పర్యావరణ కార్యదర్శి బండి వీరన్న పాల్గొన్నారు.

సచివాలయాలతో పల్లెల అభివృద్ధి

- పినిపే శ్రీకాంత్
- ఎన్.కొత్తపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారునికి అందిస్తున్న శ్రీకాంత్

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలో అందరికీ అందుబాటులో ఉద్యోగులు ఉండేలా ప్రతీ రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని నిర్మించి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేత పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఎన్.కొత్తపల్లి గ్రామంలో సచివాలయం 2 పరిధిలో శుక్రవారం అధికారులతో కలసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఆరా తీశారు. ప్రతీ నెల ఒకటో తేదీన కోడి కూతకు ముందే పింఛన్ ఇంటికి అందిస్తున్న ఘనత మన జగనన్నదే అని వివరించారు. సాంకేతిక లోపాలతో పథకాలు అందకపోతే సరి చూసి అందేలా చూడాలని ఉద్యోగులకు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వాసురాజు, పార్టీ నాయకులు దండు సత్యనారాయణరాజు, కుంచే చిన్ని, లంకే సూరిబాబు, కొంకి బాలకృష్ణ, పేరిచర్ల వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



దరియాలతిప్పలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలోని శివారు గ్రామం దరియాలతిప్పలో కేఆర్ నారాయణన్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఓఎన్‌జీసీ సంస్థ, లయన్స్ క్లబ్ పిల్లారాయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రారంభించారు. శిబిరంలో 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 20 మందికి ఆపరేషన్లు చేయాలని నిర్ణయించడంతో వారిని రాజమహేంద్రవరంలోని పరమహంస యోగానంద నేత్రాలయ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. 150 మందికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఆర్ఏఓ మునిస్వామి, సీఐ షణ్ముగం, లయన్స్ పిల్లారాయ అధ్యక్షుడు పులవర్తి శ్రీనివాస్, విద్యుత్ ఏఈ లంక కృష్ణారావు, ఏడీ పలాష్‌కుమార్ పాన్యాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ టీచర్లకు బదిలీ పాలసీ విడుదల

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్‌లలో ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూళ్లలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి నూతన విధాన పాలసీపై తమ అభిప్రాయాలను ఈ నెల ఐదవ తేదీలోగా తెలపాలంటూ శుక్రవారం పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటన విడుదల చేసింది. పలు పాఠశాలల్లో సాధారణ కాలపరిమితి పూర్తయిన వారికి కచ్చితంగా బదిలీ ఉంటుంది. ఖాళీలను బట్టి బదిలీ, రిటైర్‌మెంట్, ఆరోగ్య సమస్యలు ఉన్న టీచర్లు, రేషనలైజ్ వేకెన్సీ ఆధారంగా బదిలీలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, హెడ్‌మాస్టర్ గ్రేడ్ 1, 2, ప్రైమరీ, లెక్చరర్, టీజీటీ, పీఎస్‌టీ, లెక్చరర్ (పీఈ), పీఈటీ, ఇన్‌స్ట్రక్టర్స్ (కంప్యూటర్ సైన్స్)బాలసేవిక, కండక్టర్, లైబ్రేరియన్, ఎఫ్ఏటీ, పీఏటీ, ఇతర కేటగిరి సిబ్బందికి 3 సంవత్సరాలు, ఇతర రీజియన్‌లైతే 2సంవత్సరాలు వ్యవధిగా పేర్కొన్నారు. కౌన్సెలింగ్ అనంతరం బదిలీల జాబితా డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో ఉంచుతారు. పట్టణ పరిధి పాఠశాలలు జోన్-1, తీర ప్రాంత పాఠశాలలు అయ్యన్ననగర్ వరకు జోన్-2కు పేర్కొన్నారు. దీంతో రేషనలైజ్ వేకెన్సీస్‌ను బట్టి యానాంలో ఎక్కువ టీచర్లు ఉంటే పుదుచ్చేరికి సైతం టీచర్లకు బదిలీలు ఉంటాయని తెలుస్తోంది.

బైక్‌పై గ్రంథాలయ ఉద్యమం



యానాం చేరుకున్న గ్రంథాలయ ఉద్యమ బైక్‌యాత్ర, స్వాగతం పలికిన కవి దాట్ల

యానాం: గ్రంథాలయాల ఆవశ్యకతను తెలుపుతూ మంచికంటి వేంకటేశ్వరరెడ్డి చేపట్టిన బైక్ యాత్ర శుక్రవారం యానాం చేరుకుంది. ఆయనకు కవి దాట్ల దేవదానంరాజు, ఉపాధ్యాయుడు ముమ్మిడి చిన్నారి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 10 ఏళ్లుగా తాను సాహిత్య రచన, కథాకవిత్వం, నవల తదితరమైనవి మంచికంటి పేరుతో రాస్తున్నానన్నారు. అయితే పాఠశాలల్లో గ్రంథాలయాలు లేని పరిస్థితిని గమనించానన్నారు. తాను ఒక బస్సు ద్వారా ఒక ఏడాది చీమకుర్తి మండలంలో సంచార గ్రంథాలయాన్ని నిర్వహించినట్లు తెలిపారు. తాను రాష్ట్రవ్యాప్తంగా కవులు, రచయితలు, మిత్రులతో కలిసి గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్మించబోతున్నానని తెలిపారు. టీటీడీ సభ్యుడు మల్లాడి కృష్ణారావును, మధునాపంతుల సత్యనారాయణను కలిసినట్లు తెలిపారు. గత నెల ఈ యాత్రను 19న ఒంగోలులో కలెక్టర్ ప్రారంభించగా నెల్లూరు, చిత్తూరు, తిరుపతి మీదుగా రాయలసీమ జిల్లాల్లో పర్యటించి విజయవాడ నుంచి ఏలూరు, తణుకు, అమలాపురం మీదుగా యానాం వచ్చినట్లు తెలిపారు. యానాం నుంచి కాకినాడ, విశాఖపట్టణం, శ్రీకాకుళం మీదుగా కథానిలయం సందర్శిస్తానన్నారు.

అమృత్ సరోవర్‌లో 70 చెరువుల సుందరీకరణ



అప్పనపల్లిలో ఉపాధి పనుల్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ, ఇన్‌చార్జి డీపీఓ మధుసూదన్

మామిడికుదురు: అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జిల్లాలో 70 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టామని ఇన్‌చార్జ్ డీపీఓ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ తెలిపారు. ఆయన శుక్రవారం అప్పనపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్ని పరిశీలించారు. బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల సుందరీకరణకు సంబంధించి 52 పనులు పూర్తి అయ్యాయన్నారు. మరో 15 చెరువుల పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇంకా ఎనిమిది పనులు చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో 89,248 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 1814 పనులు జరుగుతున్నాయన్నారు. వాటిలో 1198 పంట కాలువల ఆధునికీకరణ పనులు కాగా 62 పనులు కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాలు ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. 27 మట్టి రోడ్ల నిర్మాణం జరుగుతుందని మధుసూదన్ తెలిపారు. సగటు వేతనం, ఆధార్ సీడింగ్‌లో మన జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఏపీఓ మేడిది సీతారామ్, పంచాయతీ కార్యదర్శి కోటయ్య, సచివాలయ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన అంబాజీపేట తైక్వాండో క్రీడాకారులు

అంబాజీపేట: తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన 18 మంది క్రీడాకారులు ప్రతిభ కనబర్చి బంగారు, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను సాధించినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తైక్వాండో కార్యదర్శి పితాని త్రిమూర్తులు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులను శుక్రవారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ గత నెల 31న కాకినాడ జిల్లా స్పోర్ట్స్ స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరాలను ప్రోత్సహిస్తూ మినీ ఒలింపిక్స్ గేమ్స్ నిర్వహించారన్నారు. ఈ మినీ ఒలింపిక్స్ గేమ్స్‌లో ఎం.మోక్ష, ఆర్‌డీ లక్ష్మి, ఎం.మౌనిక, బీహెచ్ కార్తీక్, కేఎస్ఆర్ స్వామినాయుడు, ఏబీ చైతన్య, బంగార్యులు బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారన్నారు. జెస్సికా, డి.గిరిజ, లాస్య, వినూత్నలు సిల్వర్ మెడల్స్‌ను, కావ్య, చరణ్యశ్రీ, పృథ్వీ, ఎంకే సత్యానందం, వరుణ్, పీఎస్ సాత్విక్, ఆర్ మూర్తిలు బ్రాంజ్ మెడల్స్ పొందారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను హెచ్ఎం బీర హనుమంతరావుతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

యానాం: నియోజకవర్గ పరిధిలోని డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా మెట్టకూరు వంశీకృష్ణకాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ లంక కృష్ణారావు పాల్గొన్నారు.

'జన్ భాగిధారి' విజయవంతం చేయాలి

డీఈవో కమలకుమారి



రాయవరం: జిల్లాలోని అందరు మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంయుక్త భాగస్వామ్యంతో 'జన్ భాగిధారి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి కోరారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించాలన్నారు. జీ- 20 ఎడ్యుకేషన్ వర్క్ గ్రూపు (జీ-20ఎడ్యుకేషన్ డబ్ల్యూజీ) కార్యక్రమంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, డిజిటల్ విద్యపై కృత్యాలను నిర్వహించాలని, ప్రతి మండలం నుంచి బెస్ట్ ఆఫ్ త్రీని ఎంపిక చేయాలన్నారు. పాఠశాల స్థాయి అనంతరం మండల స్థాయిలో కూడా దృశ్య, శ్రవణ పరికరాలను ఉపయోగించి, బోధనోపకరణాలు తయారు చేయడం, విద్యార్థులతో స్టోరీ టెల్లింగ్, రంగోలీ, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలన్నారు. మండలస్థాయిలో బెస్ట్ ఆఫ్ త్రీని ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించాలన్నారు. ఈ నెల 6లోగా పాఠశాల, మండల స్థాయి పోటీలు నిర్వహించాల్సి ఉందన్నారు. 'జన్ భాగిధారి' కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల హెచ్ఎంలు అత్యంత ప్రాధాన్యతాంశంగా భావించాలని డీఈవో కమలకుమారి సూచించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



అదృశ్యమైన డాక్టర్ వివేక్

యానాం: వ్యక్తి అదృశ్యంపై యానాం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేరు నూకరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు మండల పరిధిలోని శంకరపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ చిక్కం వివేక్ అనే 34 సంవత్సరాల వ్యక్తి ఈనెల 1వ తేదీన యానాం బైపాస్ రహదారి జంక్షన్‌కు వచ్చి అక్కడ నుంచి అదృశ్యమయ్యాడని తెలిపారు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం గాలించినప్పటికీ దొరకలేదని తెలిపారు. ఆయన గతంలో కోనసీమ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యుడిగా సేవలు అందించారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే యానాం ఎస్పీ ఫోన్ నంబరు 0884-2324800, సిఐ 0884-2321210కు తెలియజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు యానాం బైపాస్ రహదారిలోని గణపతి నగర్ వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కాకినాడ ఏటిమొగ గ్రామానికి చెందిన సూరేటి రాజు, కొరిమెల్ల మహేష్‌లకు గాయలైనట్లు తెలిపారు. వీరిని హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వీరిలో రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆసుపత్రిలో వృద్ధుడికి పింఛన్ అందజేసిన వలంటీర్



అప్పారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భారతి

ముమ్మిడివరం: కాకినాడలో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి శుక్రవారం వలంటీర్ పింఛన్ అందజేసింది. ముమ్మిడివరం మండలం కర్రివానిరేవు పంచాయతీ శివారు బూరుగుపేటకు చెందిన కాశి అప్పారావు ఇటీవల అనారోగ్యంతో కాకినాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ గ్రామానికి చెందిన వలంటీర్ పచ్చిమాల భారతి శుక్రవారం సుమారు 40కిలోమీటర్ల దూరంలో ఉన్న కాకినాడ ఆర్టీసీ బస్సులో వెళ్లి అప్పారావుకు పింఛన్ సొమ్ము అందజేసింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు వలంటీర్‌ను అభినందించారు.

వలంటీర్ ఔదార్యం

ఉప్పలగుప్తం: అనారోగ్యంతో ఉన్న లబ్ధిదారునికి ఆ వలంటీరు అమలాపురం వెళ్లి మరీ ఫించన్ అందజేసింది. మండలంలోని వానపల్లిపాలెం గ్రామానికి చెందిన నల్లా కోటేశ్వరరావు శస్త్రచికిత్స చేయించుకుని అమలాపురం తన బంధువుల ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయనకు గ్రామంలో సేవలు అందిస్తున్న వలంటీర్ ఆకుల పార్వతి శుక్రవారం వెళ్లి ఫించన్ అందజేసింది.

లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న వ్యక్తికి పింఛన్



లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

అల్లవరం: ఎంట్రుకోన గ్రామంలో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేయించుకున్న నార్గన శ్రీనుకి వైద్య ఆరోగ్య శాఖ నుంచి కొత్త పింఛన్ రూ.5వేలు మంజూరైంది. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారుడుకి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యుడు కొనుకు బాపూజీ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. వైద్య ఆరోగ్య శాఖ నుంచి పింఛన్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపాడు. సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఎంపీడీఓ జి.సరోవర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు శుక్రవారం దాతల సహాయంతో శ్రీకారం చుట్టారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిప్యూటీ లేబర్ కమిషనర్ వి.శ్రీనివాస్ ఆలయ అభివృద్ధికి ముందుకు వచ్చి సుమారు రూ.4 లక్షలు వెచ్చించారు. ఆ నిధులతో ఆలయంపై గల మండలం ప్లాస్టింగ్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ పనులకు ఆలయ అర్చకుల ప్రత్యేక పూజలు చేసి దాత శ్రీనివాస్‌తో పనులు ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను), గ్రామ పెద్దలు పెమ్మాడి సత్తిబాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఏరుపల్లికి చెందిన బొమ్ము పెద సత్యనారాయణ (62) రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై ఎస్.సత్య భుజంగరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. పెద సత్యనారాయణ మే 30న ద్విచక్ర వాహనంపై తాళ్లపాలెం వెళ్తుండగా కంచి పేట వద్దకు వచ్చేసరికి కుక్క అడ్డురావడంతో రోడ్డుపై పడిపోయి గాయాలపాలయ్యాడు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించాడు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 1న మృతి చెందాడు.